
ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
5 జనగామ
శనివారం 5 అక్టోబరు 2024



'టంగ్' వార్



- ప్రత్యర్థులే లక్ష్యంగా నోరుజారుతున్న నేతలు
- తొందరపాటుతో కొందరు.. కావాలనే మరికొందరు
- కొత్తచిక్కులు తెచ్చిపెడుతున్న విమర్శలు
- 'సినీ' దుమారం రేపిన మంత్రి కొండా సురేఖ ఆరోపణలు
- వర్గీకరణ, గుడి- బడిపై మాట జారిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు
- వివాదం కావటంతో అలా అనలేదంటూ సర్దిచెప్పుకొనే ప్రయత్నాలు
- రేవంత్ రుణమాఫీ చేయడని.. నాలుక కరుచుకున్న మానుకోట ఎంపీ
- మహబూబాబాద్ ఎమ్మెల్యే అసెంబ్లీ ప్రసంగంలో దొర్లిన బూతు పదం
- రాజీనామా చేసి గెలవాలంటూ సొంతపార్టీ ఎమ్మెల్సీ సారయ్యకి కొండా మురళి సవాల్

మాటలు.. మంటలు..

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్)

లీడర్లు టంగ్ స్లిప్ అవుతున్నారు. పొరపాటున మాట్లాడుతున్నారో.. మనసులో ఉన్నవే బయట పెడుతున్నారో తెలియదు కానీ రాజకీయంగా 'మంటలు' రేపుతున్నారు. ఫైర్ బ్రాండ్ నేతలుగా పేరున్న వారు సైతం నోరు జారి చిక్కుల్లో పడుతున్నారు. ఆలోచించడం మరిచి.. ఫ్రస్టేషన్‌లో మాటల తూటాలు పేలుస్తూ ఎదుటి వారిని నొప్పిస్తున్నారు. అంతేకాదు సోషల్ మీడియాలోనూ ట్రోల్ అవుతున్నారు. ఇటీవల వరుసగా ఓరుగల్లు నేతలు తమ వివాదాస్పద వ్యాఖ్యలతో వార్తల్లో నిలుస్తున్నారు. బహిరంగ సమావేశాల మొదలు విలేకరుల సమావేశాల వరకు.. పార్టీ కార్యాలయాల నుంచి అసెంబ్లీ వరకు తమ 'అదుపులేని' మాటలతో పెద్ద పెద్ద వివాదాలకే తెరతీస్తున్నారు. ఈ లీడర్ల టంగ్ స్లిప్ కాస్తా టంగ్ వార్‌గా మారడం చర్చనీయాంశమైంది.

తీవ్ర దుమారం రేపిన 'కొండా'

వరంగల్‌కు చెందిన దేవాదాయ, అటవీశాఖ మంత్రి కొండా సురేఖ చేసిన వాఖ్యలు రాష్ట్రవ్యాప్తంగా తీవ్ర దుమారం రేపుతున్నాయి. కేటీఆర్‌పై రాజకీయ దాడి చేసే క్రమంలో సురేఖ సినిమా హీరో నాగర్జున కుటుంబంపై చేసిన వాఖ్యలు ఇటు రాజకీయ రంగాన్ని.. అటు సినీ ఇండస్ట్రీని కుదిపేశాయి. పోలీస్ కేసులు, పరువు నష్టం దాఖలు వరకు దారి తీశాయి. అయితే సురేఖ తన వాఖ్యలను వెనుక్కి తీసుకుంటు న్నట్టు ప్రకటించారు. కానీ అప్పటికే సినీ ప్రముఖులు సురేఖ వాఖ్యలను తీవ్రంగా ఖండిస్తూ సోషల్‌మీడియా వేదికగా పోస్టులు పెట్టడంతో రచ్చ పెద్దదైంది. అంతకు ముందే తన మెడలో తన సోదర సమానుడైన మెదక్ ఎంపీ రఘునందన్‌రావు నూలు దండ వేసిన ఫొటోను షేర్ చేస్తూ బీఆర్ఎస్ నేతలు 'కల్యాణలక్ష్మీ ఎంత ఇచ్చారు' అని అనుచిత పోస్టులు పెట్టారని సురేఖ ఆరోపించారు. ఈ ఉదంతంపై ఆమె విలేకరుల సమావేశంలో కన్నీరు కూడా పెట్టుకున్నారు. దీని వెనుక కేటీఆర్ హస్తం ఉందని ఆరోపించిన సురేఖ.. అదే ఫ్రస్టేషన్‌లో కేటీఆర్‌పై మాటల దాడి చేస్తూ అక్కినేని కుటుంబంపై తీవ్ర వ్యాఖ్యలు చేశారు. ఆ తర్వాత అనుకోకుండా మాట్లాడానని, ఆ కుటుంబం బాధపడిందని తెలుసుకుని తానూ బాధపడ్డానని వివరణ ఇచ్చారు. అయితే అప్పటికే సోషల్ మీడియాలో అక్కినేని అభిమానులు, బీఆర్ ఎస్ నేతలు మంత్రిని టార్గెట్ చేస్తూ ట్రోల్ చేశారు. ఈ వ్యవహారం ప్రస్తుతం తెలుగురాష్ట్రాల్లో హాట్ టాపిక్ అయ్యింది.

తూటల్లా పేలిన నాగరాజు మాటలు..

మాజీ పోలీస్ అధికారి, వర్ధన్నపేట ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు ఇటీవల మాట్లాడిన మాటలు ఇంకా తూటల్లా పేలుతున్నాయి. సెప్టెంబరు 30వ తేదీన ఐనవోలులో జరిగిన అభివృద్ధి కార్యక్రమంలో ఎమ్మెల్యే నాగరాజు చేసిన వాఖ్యలు తీవ్ర దుమారాన్ని రేపుతున్నాయి. 'బడి కడితే మే ధావులు పెరిగిపోతారు... గుడి కడితే బిచ్చగాళ్లు పెరిగిపోతారు' అంటూ ఆయన చేసిన వాఖ్యలతో ఓ వర్గం ప్రజలు మండిపడుతున్నారు. నాగరాజు రాజీనామా చేయాలంటూ బీజేపీ కేడర్ ఆందోళనలకు దిగుతున్నారు. నాగరాజు బేషరతుగా క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేస్తున్నారు. అయితే దీనిపై వివరణ ఇచ్చిన నాగరాజు గుడులు కడితే బిచ్చగాళ్లు అవుతారనే పదాన్ని తాను కొందరు దొంగస్వాముల ఉద్దేశించి మాత్రమే అన్నానని తెలిపారు. తాను హిందువునని, శివుడి కంఠంలో ఉండే నాగరాజు పేరే తనకు పెట్టారని వివరణ ఇచ్చుకోవాల్సి వచ్చింది. అంతకుముందు కూడా ఓ సందర్భంలో నాగరాజు చేసిన వాఖ్యలు ఎస్సీ కులాల్లో గందరగోళానికి దారితీశాయి. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాట్లాడారని ఎంఆర్‌పీ ఎస్ నేతలు వారం రోజులకు పైగా ఆందోళనలు చేశారు. ఇలా వరుస ఘటనలతో ఎమ్మెల్యే నాగరాజు వార్తల్లో వ్యక్తిగా నిలిచారు.

ఇలా మాట జారి.. అలా ట్రోల్ అయ్యారు

- మే 7న మంత్రి కొండా సురేఖ, పరకాల ఎమ్మెల్యే ప్రకాష్‌రెడ్డి ఫోను సంభాషణ లీక్ అయింది. తనకు తెలియకుండానే మేయర్‌ను పార్టీలో చేర్చుకున్నారని సురేఖ అనడం చర్చనీయాంశమైంది. మంత్రి నియోజకవర్గానికి చెందిన మేయర్‌ను మంత్రికే తెలియకుండా పార్టీలో చేర్చుకోడమేంటన్న అభిప్రాయాలు వ్యక్తమయ్యాయి. అసలు ఈఫోన్ సంభాషణను ఎవరు లీక్ చేశారనే దానిపై పార్టీలో అంతర్గత చర్చ కూడా జరిగింది.
- ఆగస్టు 13న మహబూబాబాద్ ఎంపీ బలరాం నాయక్ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో చెక్కుల పంపిణీ కార్యక్రమంలో మాట్లాడుతూ సొంత పార్టీ నేత, సీఎం రేవంత్‌రెడ్డిపై చేసిన ఓ కామెంట్ దుమారం రేపింది. సీఎం రేవంత్‌రెడ్డి రూ.2లక్షల రుణ మాఫీ చేస్తానని చెప్పి, ఇంత వరకు చేయలేదని అనడంతో అక్కడున్న కాంగ్రెస్ నేతలు అవాక్కయ్యారు. అయితే నాడు రైతులకు రుణ మాఫీ చేస్తానని చెప్పి కేసీఆర్ మాట తప్పారని, రేవంత్‌రెడ్డి రుణమాఫీ చేసి చూపిస్తున్నాడని చెప్పే క్రమంలో ఎంపీ మాట దొర్లారని కాంగ్రెస్ నేతలు తరువాత సర్దిచెప్పుకోవాల్సి వచ్చింది.
- ఆగస్టు 22వ తేదీన వరంగల్ పోచమ్మ మైదాన్‌లో రోడ్డుపై ఉన్న చిరువ్యాపారుల డబ్బాలు తొలిగించగా, మాజీ ఎమ్మెల్సీ కొండా మురళీధర్‌రావు వారిని పరామర్శించారు. ఈ సందర్భంగా సొంత పార్టీకి చెందిన ఎమ్మెల్సీ బస్వరాజు సారయ్యపై ఆయన చేసిన వాఖ్యలు దూమారం రేపాయి. తాను పార్టీ మారినప్పుడు ఎమ్మెల్సీ పదవి కి రాజీనామా చేశానని, బీసీ నాయకుడనే చెప్పుకునే నాయకుడు కాంగ్రెస్‌లో చేరిన తరు వాత కూడా పదవికి రాజీనామా చేయటం లేదని, దమ్ముంటే రాజీనామా చేసి గెలిచి రావాలని సవాల్ విసిరారు. ఇలా సొంత పార్టీ నేతపై కొండా మురళీ చేసిన వాఖ్యలు పార్టీలో చర్చకు దారితీశాయి. ఇదే అవకాశంగా బీఆర్ఎస్ సోషల్ మీడియా ట్రోల్ చేసింది.
- ఇక ఇటీవల జరిగిన అసెంబ్లీ సమావేశాల్లో మహబూబాబాద్ ఎమ్మెల్యే మురళీనాయక్ జిల్లా అభివృద్ధిపై మాట్లాడిన మాటల్లో బూతులు రావడం తీవ్ర చర్చనీయాంశమైంది. అంతేకాదు ఈ మాటలతో ఎమ్మెల్యే సోషల్ మీడియాలో ట్రోలింగ్‌కు గురయ్యారు. 'సాముహిక కలెక్టరేట్లు, ప్రగతిభవన్లు, సెక్రెటరియట్లు కట్టించి మేము ఆ.. చూపిస్తున్నారు అధ్యక్షా' అంటూ అసభ్యకరంగా మాట్లాడారు. అనుకోకుండా వచ్చిన పదాలే అయినప్పటికి అసెంబ్లీ సాక్షిగా నోరు జారటంతో ఆయన విపరీతంగా ట్రోల్ అయ్యారు. వీరితో మరికొందరు ఎమ్మెల్యేలు, కీలక నేతలు కూడా పలు సందర్భాల్లో మాటలు తూలి వివాదాస్పదంగా మారారు.

నిత్య శ్రామికులు.. పారిశుధ్య కార్మికులు

కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా



పారిశుధ్య కార్మికులను సన్మానిస్తున్న కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా

జనగామ రూరల్, అక్టోబరు 4: నిత్య శ్రామికులు. పారిశుధ్య కార్మికులని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. స్వచ్ఛతా హీ సేవా-2024 ముగింపు కార్యక్రమంలో శుక్రవారం కలెక్టరేట్ కార్యాలయంలో నిర్వహించారు. కలెక్టర్ పారిశుధ్య కార్మికులను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో 1200 మల్టీపర్పస్ వర్కర్లకు ఇన్సూరెన్స్ కల్పించామని రాష్ట్ర స్థాయిలో మల్టీపర్పస్ వర్కర్లకు ఇన్సూరెన్స్ కల్పించడంలో జనగామ మొదటి స్థానంలో ఉందన్నారు. స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా మెడికల్ క్యాంప్‌లను నిర్వహించామన్నారు. ఉపాధి హామీ పనుల్లో రాష్ట్ర స్థాయిలో జనగామ జిల్లా ప్రథమ స్థానంలో ఉందని ఇదే స్ఫూర్తితో ముందుకు కొన సాగించాలని తెలిపారు. స్త్రీ నిధి రుణాల రికవరీకి సంబంధించిన రూ. 3 కోట్లు వసూ ళ్లు చేశారని, మిగతా రూ. 13 కోట్లు రికవరీ పూర్తి చేయాలన్నారు. మూడు నెలల్లో ఎల్ఆర్ఎస్ ప్రక్రియను విజయవంతంగా పూర్తి చేసిన మండలాల రెవెన్యూ అధికారులు, పంచాయతీ కార్యదర్శులను ఎంపిక చేసి సన్మాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు. జిల్లాలోని గ్రామాలను ఆరోగ్యవంతంగా, ఆదర్శవంతంగా తీర్చిదిద్ది జిల్లా మంచి పేరును తీసుకురావాలని కోరారు. అనంతరం అదనపు కలెక్టర్ పింకేశ్‌కుమార్ మాట్లాడుతూ స్వచ్ఛతా హీ సేవా కార్యక్రమంలో భాగంగా వివిధ రకాల పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించామని తెలిపారు. విద్యార్థులు, ప్రజలకు పరిసరాల పరిశుభ్రతపై అవగాహన కల్పించా మన్నారు. స్త్రీ నిధి రుణాలు రికవరీ చేసిన వీవోలు, ఏపీఎంలను సన్మానించడం జరిగిందన్నారు. వృథాగా పారవేసే పదార్థాల నుంచి అందమైన, ఉపయోగకరమైన వస్తువులుగా తీర్చిదిద్దిన నర్మెట కేజీబీవీ విద్యార్థులు మొదటి, దేవరుప్పుల జడ్పీహెచ్ఎస్ విద్యార్థులు ద్వితీయ. బచ్చన్నపేట కేజీబీవీ విద్యార్థులు తృతీయ బహుమతులు గెలుపొందారని తెలిపారు. కార్యక్రమంలో జేడ్పీ సీఈవో సరిత, డీపీవో స్వరూప, డీఆర్డీవో పీడీ వసంత తదితరులు పాల్గొన్నారు.

తుది దశకు సర్వే: కలెక్టర్

జనగామ రూరల్, అక్టోబరు 4: జనగామ జిల్లాలో ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వే ప్రక్రియను అధికారుల సమర్థవంతంగా నిర్వహిస్తున్నారని, సర్వే తుది దశకు చేరుకుందని కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా అన్నారు. ఫ్యామిలీ డిజిటల్ కార్డు సర్వేను కలెక్టర్ శుక్రవారం మండలంలోని ఎర్రగొల్లపహడ్ శివారులోని పెద్దతండా(వై)లో పరిశీలించారు. ఈసందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ అక్టోబరు 3నుంచి ఈనెల 7 రకు 5 రోజుల పాటు సర్వే నిర్వహిస్తామని తెలిపారు. సర్వే చేస్తున్న అధికారులు కుటుంబ సభ్యుల వివరాలు, అధార్ నంబరు, అడ్రస్ ఏ ఒక్కటి మిస్ కాకుండా నమోదు చేయాలన్నారు. అధికారులు సమర్థవంతంగా, బాధ్యతయుతంగా సర్వే చేస్తున్నారన్నారు. సర్వే ఎంత బాధ్యతగా వేగవంతంగా చేస్తున్నారో అదే విధంగా ఎంపిక చేసిన ప్రతీ కుటుంబం వివరాలను కూడా అంతే బాధ్యగా పక్కాగా చెక్ చేయాలన్నారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, జేడ్పీసీఈవో సరిత, ఎంపీడీవో సంపత్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 8న జాబ్‌మేళా

జనగామ రూరల్, అక్టోబరు 4: ఈనెల 8న జనగామలో జాబ్‌మేళా నిర్వహిస్తునట్లు జిల్లా ఎంప్లాయిమెంట్ అధికారి మల్లయ్య ఒక ప్రకటన ద్వారా తెలిపారు. హైదరాబాద్‌లోని ఎస్ బ్యాంకు, హెచ్‌డీఎఫ్‌సీ, యాక్సిస్ బ్యాంకులో సెల్స్ ఆఫీసర్స్ కొరకు ఈనెల 8న కలెక్టర్ కార్యాలయంలోని జిల్లా ఉపాధి కల్పన కార్యాలయంలో ఇంటర్వ్యూలు నిర్వహిస్తునట్లు తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా డిగ్రీ పూర్తి చేసిన నిరుద్యోగులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోగలరని తెలిపారు. ఇతర వివరాలకు 7995430401 నంబరును సంప్రదించగలరని తెలిపారు.

మా జిల్లా కాదు.. ప్రసవం చేయం

- నిండు గర్భిణిని తిప్పి పంపిన ఎంసీహెచ్ వైద్యులు
- ఘటన వైరల్ అవడంతో అడ్మిట్ చేసుకున్న వైనం

జనగామ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): జనగామ ఎంసీహెచ్ ఆస్పత్రికి ప్రసవం కోసం వచ్చిన ఓ గర్భిణికి చేదు అనుభవం ఎదురైంది. 9 నెలల కడుపుతో ఆసుపత్రికి వచ్చిన ఆమెకు ప్రసవం చేయబోమంటూ డ్యూటీలో ఉన్న వైద్యులు నిరాకరించారు. ఈ సంఘటన జనగామ మండలం చంపక్‌హిల్స్‌లోని మతాశిశు ఆసుపత్రి(ఎంసీహెచ్)లో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెలితే యాదాద్రి భువనగిరి జిల్లా యాదగిరిగుట్టకు చెందిన స్పందన 9 నెలల గర్భవతి. స్పందన తల్లిగారి ఊరు జనగామ కాగా ఆమెకు గర్భం దాల్చిన నాటి నుంచి ఎంసీహెచ్‌లోనే నెలవారీ పరీక్షలు చేయించుకుంటుంది. వైద్యులు ఈనెల 11న డెలివరీ డేట్ ఇచ్చారు. క్రమంలో ప్రసవం సమయం దగ్గరపడడంతో ఆసుపత్రిలో అడ్మిట్ అయ్యేందుకు శుక్రవారం ఎంసీహెచ్‌కు వచ్చింది. ఈ క్రమంలో అడ్మిట్ సమయంలో ఆధార్ కార్డు చూసిన వైద్యులు, సిబ్బంది స్పందనది యాదాద్రి భువనగిరి జిల్లాగా గుర్తించారు. దీంతో ఇతర జిల్లా వాళ్లకు ఇక్కడ ప్రసవాలు చేయలేమని, మీ జిల్లాకు వెళ్లి చేయించుకోవాలని వైద్యులు తేల్చి చెప్పారు. దీంతో ఖంగుతిన్న స్పందన, కుటుంబ సభ్యులు మీడియా దృష్టికి తెచ్చారు. ఈ విషయం సామాజిక మాధ్యమాల్లో వైరల్ కావడంతో స్పందించిన వైద్యులు స్పందనను అడ్మిట్ చేసుకున్నారు. కాగా.. ఈ విషయంపై ఎంసీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ మధుసూదన్‌రెడ్డిని వివరణ కోరగా.. పని ఒత్తిడి వల్ల వైద్యులు అలా మాట్లాడారని, ఈ విషయం తన దృష్టికి రాగానే గర్భిణిని అడ్మిట్ చేయించానని తెలిపారు.

దసరాకు ప్రత్యేక బస్సు సర్వీసులు

జనగామ రూరల్, అక్టోబరు 4: దసరా పండుగ సందర్భంగా ప్రత్యేక బస్సుల ను నడపనున్నట్లు జనగామ ఆర్టీసీ డిపో మేనేజర్ ఎస్.స్వాతి శుక్రవారం ఒక ప్రకటన ద్వారా తెలిపారు.సద్దుల బతుకమ్మ, దసరా పండుగల సందర్భంగా రాష్ట్ర ప్రభుత్వం జనగామ నుంచి హైదరాబాద్, జగద్గిరిగుట్ట నుంచి 113 ప్రత్యేక బస్సులను నడుపనున్నట్లు తెలిపారు. ప్రయాణికులు ఆర్టీసి బస్సులో ప్రయాణం చేసి సురక్షితంగా గమ్య స్థానానికి చేరుకోవాలని సూచించారు.

ఇద్దరు న్యాయమూర్తుల బదిలీ

జనగామ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రవ్యాప్తంగా పలువురు జడ్జిలను ప్రమోషన్లు కల్పిస్తూ, బదిలీలు చేస్తూ హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. ఇం దులో భాగంగా జనగామ జిల్లా కోర్టులో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి, జ్యుడి షీయల్ ఫస్ట్ క్లాస్ మెజిస్ట్రేట్‌గా ఉన్న ఈ. సుచరితకు జనగామ సీనియర్ సివిల్ జడ్జిగా పదోన్నతి కల్పించారు. అదేవిధంగా జనగామ సీనియర్ సివిల్ జడ్జి, అసిస్టెంట్ సెషన్స్ జడ్జిగా ఉన్న సి.విక్రమ్‌ను జనగామ జిల్లా న్యాయ సేవా అధికార సంస్థ కార్యదర్శిగా బదిలీ చేశారు.

అయ్యో.. పాపం!

- ఉగాండాలో యువ ఇంజినీరు హత్య
- గన్‌తో కాల్చి చంపిన కంపెనీ సెక్యురిటీ గార్డు
- ఆపై తనను తాను కాల్చుకొని ఆత్మహత్య
- రాయల్ టెక్ కంపెనీలో ప్రాజెక్టు ఇంజనీర్‌గా పనిచేస్తున్న తిరుమలేశ్



తిరుమలేశ్ మరణవార్తతో రోదిస్తున్న కుటుంబ సభ్యులు, స్థానికులు



మృతుడు తిరుమలేశ్(ఫైల్)

జనగామ, అక్టోబరు 4 (ఆంధ్రజ్యోతి): ఉద్యోగరీత్యా ఉగాండాకు వెళ్లిన జనగామకు చెందిన యువ ఇంజనీరు హత్యకు గురయ్యాడు. తాను పనిచేస్తున్న కంపెనీ సెక్యూరిటీ గార్డు చేతిలో హతమయ్యాడు. ఈ ఘటన ఉగాండా రాజధాని కంపాలా సమీపంలోని సెంబాబులే జిల్లాలో శుక్రవారం చోటు చేసుకుంది. వివరాల్లోకెలితే.. జనగామ జిల్లాకేంద్రం గిర్నిగడ్డకు చెందిన ఇటికాల తిరుమలేశ్(42) నల్లగొండకు చెందిన రాయల్ టెక్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీలో ప్రాజెక్టు ఇంజనీరుగా పనిచేస్తున్నాడు. కొంతకాలం ఇక్కడే పనిచేసిన ఆయన 2014లో ఉగాండాకు వెళ్లారు. అప్పటి నుంచి భార్య సనీత, కుమారుడు వరుణ్‌తో కలిసి ఉగాండాలోనే ఉంటున్నారు. కాగా.. తిరుమలేశ్ కూతురు అఖిల నిజామాబాద్‌లోని అమ్మమ్మ ఇంట్లో ఉంటూ చదువుతోంది. ఈ క్రమంలో తిరుమలేశ్ ప్రతి రెండేళ్లకొకసారి జనగామకు వచ్చి వేళ్లేవాడు. గత 16 నెలల క్రితం జనగామకు వచ్చి వెళ్లారు. కాగా.. తిరుమలేశ్ ఉగాండా రాజధాని కంపాలా సమీపంలోని సెంబాబులే జిల్లాలో ఉన్న రాయల్ టెక్ కంపెనీలో పర్యవేక్షణ కోసం శుక్రవారం వెళ్లాడు. ఈ సమయంలో కంపెనీలో సెక్యూరిటీ గార్డుగా పనిచేస్తున్న వ్యక్తి తన వద్ద ఉన్న గన్‌తో తిరుమలేశ్‌పై నాలుగైదు రౌండ్లు కాల్పులు జరిపాడు. ఈక్రమంలో తిరుమలేశ్ అక్కడికక్కడే కుప్పలిపోయి మృతిచెందాడు. ఆ సమయంలో అక్కడే ఉన్న కార్మికులు, ఉద్యోగులు సెక్యూరిటీ గార్డుకు ఎదురు తిరగగా సెక్యూరిటీ గార్డు తనను తాను కాల్చుకొని చనిపోయినట్లు మృతుడి కుటుంబ సభ్యులు చెబుతున్నారు. కాగా.. మృతదేహాన్ని స్థానికంగా ఆసుపత్రికి తరలించి పోస్టుమార్టం నిర్వహిస్తున్నారు. మృతదేహాన్ని జనగామకు తీసుకువచ్చేందుకు మృతుడి సోదరుడు చిన్నా ప్రయత్నం చేస్తున్నారు. కాగా.. హత్యకు గల కారణాలు తెలియరాలేదు.

జనగామలో విషాదం

తిరుమలేశ్ మరణవార్తతో జనగామ జిల్లాకేంద్రంలోని గిర్నిగడ్డలో విషాదం నెలకొంది. తిరుమలేశ్ హత్య వార్తతో మృతుడి తల్లి, సోదరి, తమ్ముడు కన్నీరుమున్నీరుగా విలపిస్తున్నారు. మృతుడి తమ్ముడు చిన్నా అన్న మృతదేహాన్ని జనగామకు తీసుకువచ్చేందుకు ప్రయత్నాలు చేస్తున్నాడు. ఉగాండాలో ఉన్న తెలుగు ఇంజినీర్లు తిరుమలేశ్ మృతదేహాన్ని వీడియో కాల్ ద్వారా కుటుంబ సభ్యులకు చూపించగా బోరున విలపించారు.

త్వరలోనే ఇందిరమ్మ గ్రామ కమిటీల నియామకం

ఎమ్మెల్యే కడియం శ్రీహరి



సీఎంఆర్ఎఫ్ చెక్కులు పొందిన లబ్ధిదారులతో ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 4: దసరా పండుగ లోపే ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం ఇందిరమ్మ గ్రామ కమిటీల ఏర్పాటుకు ప్రభుత్వం త్వరలోనే జీవో జారీ చేయబోతుందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్ర వారం నియోజకవర్గంలోని వివిధ మండలాలకు చెందిన 121 మంది లబ్దిదారులకు రూ 35,88,500 విలువైన సీఎం ఆర్ఎఫ్ చెక్కులను కడి యం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తరువాత నాలుగు నెలల కాలంలోనే కల్యాణలక్ష్మి, సీఎంఆర్ఎఫ్ ద్వారా 1000 మంది లబ్ధిదారు లకు రూ 10కోట్ల మేర ఆర్థికసాయం అం దించడం జరిగిందన్నారు. దసరా లోపు ప్రజ లకు హెల్త్‌కార్డులు, అర్హులైనవారికి రేషన్‌కా ర్డులు, పింఛన్‌లు అమలు చేయడానికి గా ను త్వరలో జీవో విడుదల చేయబోతున్నట్లు తెలిపారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపి క కోసం 7గురు సభ్యులతో ఇందిరమ్మ కమి టీలను ఏర్పాటు చేయన న్నట్లు తెలిపారు. కార్యక్రమంలో నాయకులు తదితరులు పాల్గొన్నారు. కాగా మండలంలో ని తానేదార్‌పల్లి గ్రామానికి చెందిన ఆకుల శ్రీనివాస్ (55) అనే రైతు అప్పులబాధతో ఉరివేసుకొని ఆత్మహత్య చేసుకోగా విషయం తెలుసు కున్న ఎమ్మెల్యే కడియం శ్రీహరి మృతుడి ఇంటిని సందర్శించి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. బెలిదె వెంకన్న, మంతెన ఇంద్రసేనా రెడ్డి, మాచర్ల కుమారస్వామి, దుంపల పద్మారెడ్డి బిక్షపతి, తదితరులు పాల్గొన్నారు.

మహిళలపై పెరుగుతున్న ఆగడాలు

- ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య



సమావేశంలో మాట్లాడుతున్న ఐద్వా జిల్లా అధ్యక్షురాలు అహల్య

బచ్చన్నపేట, అక్టోబరు 4: దేశంలో, రాష్ట్రంలో మహిళలకు రక్షణ లేకుండా పోతోందని, అత్యాచారాలు, హత్యలతో అట్టుడికి పోతోందని ఐద్వా జిల్లా అధ్యక్షురాలు ఇర్రి అహల్య అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్అండ్‌బీ అతిథి గృహ ఆవరణలో ఐద్వా మండల మహాసభ జరిగింది. ఈ సందర్భంగా అహల్యా మాట్లాడుతూ కేంద్రంలో బీజేపీ అధికారంలోకి వచ్చిన తర్వాత మహిళల పట్ల వివక్ష పెరిగిపోయిందని, పలు రాష్ట్రాల్లో అత్యాచారాలు పెరిగిపోయాయన్నారు. మహిళలు పోరాడి సాధించుకున్న చట్టాలను సక్రమంగా అమలు చేయటం లేదని విమర్శించారు. స్వేచ్ఛ, సమానత్వం కోసం మహిళలు పోరాడాలల్సిన అవసరముందన్నారు. ఈ సందర్భంగా 23 మందితో మండల కమిటీని ప్రకటించారు. అధ్యక్షురాలిగా జంధ్యాల కావ్య కార్యదర్శిగా మానేపల్లి నిర్మల, ఉపాధ్యక్షులుగా కర్రె మమత, గంధమాల నవనీత, తాడూరి వెంకటవ్వ, సహాయ కార్యదర్శులుగా పయ్యావుల శ్రీలత, లక్ష్మీ, కల్పన, కవితలను ఎన్నుకున్నారు.

మొనగాడు కాదు.. మోసగాడు

- రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్లేసి మాట తప్పాడు
- ఆరు గ్యారంటీలనూ సక్రమంగా అమలు చేయలేకపోయాడు
- సీఎం రేవంత్‌పై మాజీమంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ ఫైర్
- తొర్రూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా
- ఎడ్లబండిపై నిరసన ర్యాలీ

7లో...



తొర్రూరులో జరిగిన రైతు ధర్నాలో మాట్లాడుతున్న హరీష్ రావు. చిత్రంలో ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతిరాథోడ్, పల్లా రాజేశ్వర్‌రెడ్డి, మధుసూదనాచారి తదితరులు

మాజీ మంత్రి హరీష్‌రావుకు ఘన స్వాగతం



నెల్లుట్లలో మాజీ మంత్రి హరీష్‌రావుకు స్వాగతం పలుకుతున్న బీఆర్ఎస్ కార్యకర్తలు

లింగాలఘణపురం, అక్టోబరు4: మహబూబాద్ జిల్లా తొర్రూరులో జరిగిన రైతు దీక్ష కార్యక్రమానికి వెళ్తున్న మాజీ మంత్రి హరీష్‌రావుకు శుక్రవారం లింగాలఘణపురం మండలం నెల్లుట్లలో మాజీ ఎమ్మెల్యే డాక్టర్ రాజయ్య ఆధ్వర్యంలో బీఆర్ఎస్ కార్యకర్తలు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా హరీష్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేసి శాలువాలతో సన్మానించారు. కార్యక్రమంలో నాయకులు ఊడ్గుల బాగ్యలక్ష్మి, గండి యాదగిరి, అంతగల్ల రాంచందర్, జున్నూతుల సుధీర్‌రెడ్డి, నల్ల మైసయ్య, లింగమూర్తి, భైరు యాకన్న, దయ్యాల గణేశ్, రేగు శ్రీశైలం, గండి చంద్రశేఖర్, గండి కృష్ణ, గండి నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే నెల 4 నుంచి
ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు

కేయూ క్యాంపస్, అక్టోబరు 4: కేయూ ప్రీ పీహెచ్‌డీ పరీక్షలు నవంబరు 4వ తేదీ నుంచి నిర్వహిస్తామని కేయూ పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ శ్రీరామోజు నరసింహాచారి, అదనపు పరీక్షల నియంత్రణాధికారి డాక్టర్ బీఎస్ఎల్ సౌజన్య గురువారం తెలిపారు. నవంబరు 4న శుక్రవారం ప్రీ పీహెచ్‌డీ మొదటి పేపర్-1, అలాగే నవంబరు 8న ఎలక్టివ్ పేపర్-2లో పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించారు. పరీక్షలు ఆయా తేదీల్లో మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు జరుగుతాయని వెల్లడించారు. పరీక్షల కేంద్రాన్ని వర్సిటీ ఇంజనీరింగ్ కళాశాలలో ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. ఫార్మసీ, ఇంజనీరింగ్, లా, సైన్స్, ఆర్ట్స్, సోషల్ సైన్స్, కామర్స్, ఎడ్యుకేషన్ విభాగాల్లో అభ్యర్థులు పరీక్షలకు హాజరుకానున్నారు.

కాజీపేట మీదుగా దసరా ప్రత్యేక రైళ్లు

కాజీపేట, అక్టోబరు 4: కాజీపేట- దాదర్, దాదర్ - కాజీపేటల మధ్య దసరా ప్రత్యేక రైళ్లు నడపనున్నట్టు రైల్వే అధికారులు శుక్రవారం తెలిపారు. 07195 కాజీపేట - దాదర్ అక్టోబరు 16, 23, నవంబర్ 13, 20, 27 తేదీల్లో కాజీపేట నుంచి ప్రతీ బుధవారం 15.00 గంటలకు బయలు దేరి గురువారం 13.25 నిమిషాలకు చేరుకుంటుంది. 07196 దాదర్ - కాజీపేట ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 17, 24, నవంబర్ 14, 21, 28, తేదీల్లో దాదర్‌లో ప్రతీ గురువారం 15.25 నిమిషాలకు బయలుదేరి శుక్రవారం 16 గంటలకు కాజీపేటకు చేరుకుంటుంది. 07197 కాజీపేట-దాదర్ ఎక్స్‌ప్రెస్ కాజీపేటలో అక్టోబరు 12, 19, 26 నవంబర్ 2, 11, 16, 23, 30 ప్రతీ శనివారం 11.30నిమిషాలకు బయలుదేరి ఆదివారం 13.25కు చేరుకుంటుంది. (07198) దాదర్ - కాజీపేట ఎక్స్‌ప్రెస్ అక్టోబర్ 13, 20, 27 నవంబరు 3, 10, 24, 27 డిసెంబరు 1వ తేదీన దాదర్‌లో ప్రతీ ఆదివారం 15.25నిమిషాలకు బయలుదేరి సోమవా రం కాజీపేటకు 21.30 నిమి షాలకు చేరుకుంటుంది. ఈ రైలుకు జమ్మికుంట, పెద్దపల్లి, మంచిర్యాల, బెల్లంపల్లి, కాగజ్‌నగర్, బల్లార్షా, చంద్రాపూర్, బందర్, వాని, కయర్, లింగ్‌టీ, పింపల్క్‌హుటి, ఆదిలాబాద్, కిన్‌వేట్, సమ్రఖండ్, హిమయత్‌నగర్, బోకర్, మెద్కేడ్, నాందేడ్, పూర్ణ, పర్బానీ, పెలు, పర్భున్, జల్నా, ఔరంగబాద్, లానూర్, రోటేగాం, నాగర్‌సోల్, మన్మాడ్, నాసిక్, ఇగ్‌టాపూరి, కళ్యాన్, రైల్వేస్టేషన్లలో హాల్టింగ్ ఇచ్చారు.

కొనసాగుతున్న డీఎస్సీ సర్టిఫికెట్ల వెరిఫికేషన్

వరంగల్ ఎడ్యుకేషన్, అక్టోబరు 4: డీఎస్సీ-2024లో అర్హత సాధించిన అభ్యర్థుల సర్టిఫికెట్లు 1:3 మెరిట్ ప్రాతిపదికన వెరిఫికేషన్ కొనసాగుతోంది. సర్టిఫికెట్ల వెరిఫికేషన్ శుక్రవారంతో రెండోరోజుకు చేరుకుంది. హనుమకొండలోని సుబేదారి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న వెరిఫికేషన్ ప్రక్రియ సజావుగా సాగుతున్నట్లు డీఈవో డి.వాసంతి తెలిపారు. కాగా, శనివారంతో వెరిఫికేషన్ ప్రక్రియ ముగియనుంది.

ఎస్సీ వర్గీకరణ చేయకుండా ఉద్యోగాల భర్తీ చేయడం అన్యాయం

న్యూశాయంపేట, అక్టోబర్4: ఎస్సీ వర్గీకరణ లేకుండా ఉపాధ్యాయ ఉద్యోగాలు భర్తీ చేయడం అన్యాయమని, ఇది మాదిగలకు ద్రోహం చేయడమేనని ఎంఆర్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గోవింద నరేష్ మాదిగ అన్నారు. శుక్రవారం న్యూశాయంపేటలో ఏర్పాటుచేసిన ఎంఆర్‌పీఎస్, అనుబంధ సంఘాల సమావేశంలో నరేష్ మాట్లాడారు. సీఎం రేవంత్‌రెడ్డి వైఖరికి నిరసనగా ఈ నెల 9వ తేదీన రాష్ట్ర వ్యాప్తంగా నిరసనలు చేస్తామన్నారు. ఈ నిరసనకు ఎంఆర్‌పీఎస్ నాయకులు అధికసంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు గద్దల సుకుమార్ మాదిగ, ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ నాయకులు పాల్గొన్నారు.

మానుకోట కాంగ్రెస్ నేత నూకల నరేశ్‌రెడ్డి కన్నుమూత

● వారం కిందట గుండెపోటు.. హైదరాబాద్ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ మృతి
నేడు పురుషోత్తమాయగూడెంలో అంత్యక్రియలు



మరిపెడ, అక్టోబరు 4: కాంగ్రెస్ సీనియర్ నేత, మహబూబాబాద్ జిల్లా మరిపెడ మండలం పురుషోత్తమాయగూడెం గ్రామానికి చెందిన నూకల నరేశ్‌రెడ్డి(74) శుక్రవారం కన్నుమూశారు. వారం రోజుల కిందట ఆయనకు గుండెపోటు రావడంతో కుటుంబ సభ్యులు హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం సాయంత్రం తుదిశ్వాస విడిచారు. ఆయన మృతితో అభిమానులు శోకసముద్రంలో మునిగిపోయారు. వారం కిందట హైదరాబాద్ ఆస్పత్రిలో చేరిన ఆయనకు వైద్యులు స్టెంట్ వేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మంత్రులు, మాజీ మంత్రులు, పలువురు ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు ఆస్పత్రికి వెళ్లి నరేశ్‌రెడ్డి పరామర్శించారు. ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు. అయితే నరేశ్‌రెడ్డికి డాక్టర్లు మెరుగైన వైద్యం అందించినా ఫలితం లేకుండాపోయింది. శుక్రవారం సాయంత్రం ఆయన తుదిశ్వాస విడిచారు. నూకల నరేశ్‌రెడ్డి జీవితం ఓ తెరిచిన పుస్తకం. మేనమామ రామసహా యం సురేందర్‌రెడ్డి ద్వారా రాజకీయ వారసత్వం అందుకున్న ఆయన నాటి నుంచి నేటి వరకు కాలం తో పోరాటం చేస్తూనే ఉన్నారు. ఈ క్రమంలో రాజకీయంగా అనేక పదవులు అందనట్టే అంది చేజారిపోయాయి. అయినా ఎన్నడూ నిరాశ చెందని ఆయనకు ఎలాంటి పరిస్థితుల్లో అయినా తనను నమ్మినోళ్లకు అండగా ఉన్నారన్న పేరుంది. నరేశ్‌రెడ్డికి భార్య, ఇద్దరు కుమారులున్నారు. శుక్రవారం రాత్రికి ఆయన భౌతిక కాయాన్ని స్వగ్రామానికి తీసుకురానుండగా.. శనివారం పురుషోత్తమయాగూడెంలోని వ్యవసాయ క్షేత్రంలో అంతిమ సంస్కారాలు నిర్వహించేందుకు కుటుంబసభ్యులు ఏర్పాట్లు చేస్తున్నారు. అంత్యక్రియలకు భారీగా జనం తరలొచ్చే అవకాశం ఉండటంతో మహబూబాబాద్ ఎస్పీ సుధీర్‌రాంనాథ్ కేకన్ నేతృత్వంలో పటిష్ఠ బందోబస్తు చర్యలు తీసుకుంటున్నారు. నరేశ్‌రెడ్డి వ్యవసాయ క్షేత్రాన్ని శుక్రవారం రాత్రి పరిశీలించారు.

రాజకీయ ప్రస్థానమిలా..

1989 అసెంబ్లీ ఎన్నికల్లో డోర్నకల్ కాంగ్రెస్ బీఫామ్ ఆయనకే ఖరారైనా కొందరి మోసపూరిత మాటలకు బలియై పోటీకి దూరమయ్యారు. 1994లో డోర్నకల్ నుంచి స్వతంత్ర అభ్యర్థిగా పోటీ చేసి ఓటమి పాలయ్యారు. అనంతరం జరిగిన పరిణామాలతో టీడీపీలో చేరిన ఆయన 1999ఎన్నికల్లో ఆ పార్టీ అభ్యర్థిగా బరిలో నిలిచి స్వల్ప ఓట్ల తేడాతో రెడ్యానాయక్ చేతిలో ఓడిపోయారు. ఆ తర్వాత ఉమ్మడి వరంగల్ జిల్లా జడ్పీ చైర్మన్ పదవిని ఆశించిన నరేశ్‌రెడ్డి ఎర్రబెల్లి దయాకర్‌రావు చేయూతతో రాయపర్తి జడ్పీటీసీగా గెలిచారు. జడ్పీ చైర్మన్ కోసం గట్టిపోటీ ఇచ్చారు. 2012లో తెలంగాణ ఉద్యమానికి ఆకర్షితులై అప్పటి టీఆర్ఎస్‌లో చేరారు. ఆ తర్వాతి పరిణామాల్లో 2024లో మళ్లీ సొంతగూడైన కాంగ్రెస్‌లో చేరి.. ఎంపీ బలరాంనాయక్ గెలుపులో భాగస్వామ్యం అయ్యారు. అంతేకాదు ఆయనకు ఖమ్మం జిల్లాతోనూ ఎంతో రాజకీయ అనుబంధం ఉంది. రాష్ట్ర ఆవిర్భావం తర్వాత జరిగిన తొలి అసెంబ్లీ ఎన్నికల్లో నరేశ్‌రెడ్డి బీఆర్ఎస్ తరఫున ఆ జిల్లా ఇన్‌చార్జ్‌గా పని చేశారు. పాలేరు ఉపఎన్నికల్లో తుమ్మల గెలుపులో తనవంతు పాత్ర పోషించారు. 2018 ఎన్నికల్లోనూ మరోసారి ఇన్‌చార్జిగా పనిచేశారు. 2020ఖమ్మం కార్పొరేషన్ ఎన్నికల్లో టీఆర్ఎస్ గెలుపునకు కృషి చేశారు.

ఆటోడ్రైవర్లకు డ్రైవింగ్ లైసెన్సుల అందజేత



ఆటోడ్రైవర్స్‌కు లైసెన్సును అందజేస్తున్న సీపీ

హనుమకొండ టౌన్, అక్టోబర్ 4: డ్రైవింగ్ లైసెన్స్ లేని 35 మంది డ్రైవర్లకు సీపీ అంబర్ కిషోర్ ఝా శుక్రవారం డ్రైవింగ్ లైసెన్స్ అందజేశారు. కొద్ది రోజుల కిందట ట్రైసిటీ పరిధిలోని ఆటోడ్రైవర్స్‌కు ట్రాఫిక్ పోలీసులు ఆధ్వర్యంలో అవగహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా డ్రైవింగ్ లైసెన్స్ లేని ఆటోడ్రైవర్స్‌కు తాను చొరవ తీసుకొని లైసెన్స్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. సీపీ ఆదేశాలతో రవాణాశాఖ అధికారులు, ట్రాఫిక్ పోలీసుల సమన్వయంగా డ్రైవర్స్‌నుంచి కావాల్సిన దస్ర్తాలను తీసుకొని లైసెన్స్‌లను మంజూరు చేశారు. శనివారం కమిషనరేట్ కార్యాలయంలో ట్రాఫిక్ ఏసీపీ సత్యనారాయణ సమక్షంలో ఆయా డ్రైవర్స్‌కు సీపీ లైసెన్స్‌లను అందజేశారు. రానున్న రోజుల్లో హనుమకొండ, వరంగల్ ట్రాఫిక్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని డ్రైవర్లకు సైతం లైసెన్స్‌లు ఇప్పిస్తామన్నారు. కాజీపేటలో లైసెన్స్‌లు ఇప్పించడానికి కృషిచేసిన సీఐ నాగబాబు, ఎస్సై ఉమాకాంత్‌లను సీపీ ప్రత్యేకంగా అభినందించారు.

బీజేపీ డ్రామాలకు రైతులు మోసపోవద్దు

● రుణమాఫీపై ధర్నాలు చేయడానికి ఆ పార్టీ నాయకులకు సిగ్గుండాలి
● మూసీ నది ప్రక్షాళనలో ప్రతిపక్షాల తీరు సిగ్గుచేటు
● మీడియా సమావేశంలో ఎమ్మెల్యే కడియం శ్రీహరి



మీడియా సమావేశంలో మాట్లాడుతున్న స్టేషన్ ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 4: రైతులకు ఏనాడూ రుణమాఫీ చేయని బీజేపీ వాళ్లు ఇప్పుడు రుణమాఫీ విషయంలో ధర్నాల పేరుతో డ్రామాలు చేస్తున్నారని, ఆ డ్రామాలను నమ్మి రైతులు మోసపోవద్దని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి తెలిపారు. డివిజన్ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో ఆయన మాట్లాడారు. రైతు రుణమాఫీ విషయంలో ప్రతిపక్షాలు తప్పుడు ఆరోపణలు చేయడం సరికాదని, ఇప్పటికే 23లక్షల మందికి రుణమాఫీ వర్తింపజేశామని, దాదాపు రూ.18వేల కోట్లు రైతుల ఖాతాల్లో జమయ్యా యన్నారు. గతంలో రాష్ట్ర ప్రభుత్వం నిర్దేశించుకున్న విధానాల ప్రకారం 42లక్షల మంది రైతులకు రుణమాఫీ వర్తింపజేయబోతున్నామని అందుకుగాను రూ.31వేల కోట్ల ఖర్చు చేయబోతున్నామని వివరించారు. అర్హులైన ప్రతీ రైతుకు రుణమాఫీ వస్తుందని, రైతులు ప్రతిపక్షాల మాటాలు పట్టించుకోవద్దన్నారు. దేశంలో ఏ రాష్ట్రంలో ఎక్కడా కూడ ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి రుణామాఫీ చేసిన చరిత్ర లేదని, కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ రైతుల రుణమాఫీ ఏనాడు చేయలేదని, కనీసం రుణమాఫీ చేస్తున్న రాష్ట్రాలకు ఆర్థిక చేయూత కూడా ఇవ్వలేదని దుయ్యబట్టారు. రైతులకు ఏమీ చేయని బీజేపీ నాయకులు ధర్నాలు చేయడం సిగ్గుచేటని, వారికి రైతులపై ప్రేమ ఉంటే కేంద్రాన్ని ఒప్పించి దేశ వ్యాప్తంగా రైతు రుణమాఫీ ప్రకటించాలన్నారు. రాష్ట్ర బీజేపీ నాయకులు నరేంద్రమోదీని ప్రశ్నించే ధైర్యం లేదని బీజేపీ అంటేనే రైతు, దళిత, తెలంగాణ వ్యతిరేక పార్టీ అని విమర్శించారు. మూసీనది ప్రక్షాళన విషయమై ప్రతిపక్షాలు తీవ్రస్థాయిలో విమర్శలు చేస్తున్నాయని, మూసీ పరివాహక ప్రాంతంలో నివాసం ఉంటున్న పేదలు సుమారు 1000 మంది స్వచ్ఛందంగా వెళ్లిపోగా వారికి ఇందిరమ్మ ఇళ్లు ఇచ్చామని, దీనిపై సీఎం ఓ స్పష్టమై విధానంతో ఉన్నారన్నారు. కానీ స్వచ్ఛందంగా వెళ్లిపోయే వారిని వెళ్లిపోకుండా మీరు ఈ మురికిలోనే ఉండాలని కొన్ని రాజకీయ పార్టీలు ప్రయత్నాలు చేయడం దుర్మార్గమన్నారు. కాంగ్రెస్ పార్టీ అంటేనే పేదల పార్టీ అన్నారు. పేదల ఓట్లతోనే గెలిచిన పార్టీ కాంగ్రెస్ అని చెప్పారు. పేదలను ఇబ్బందులు పెట్టే ప్రయత్నం కాంగ్రెస్ పార్టీ చేయదన్నారు. కార్యక్రమంలో నాయకులు బెలిదె వెంకన్న, సీహెచ్ నరేందర్ రెడ్డి, శిరీష్‌రెడ్డి, వెంకటేశ్వర్ రెడ్డి, మంచాల ఎల్లయ్య, నూకల ఐలయ్య, గడ్డమీది సురేష్, అన్నం బ్రహ్మరెడ్డి, డాక్టర్ అంబటి కిషన్‌రాజ్, తెల్లాకుల రామకృష్ణ, చాడ రాజ్‌కుమార్, గన్ను నర్సింహులు, రజాక్‌యాదవ్, కోతి రాములు, ఇనుగాల రాజిరెడ్డి, ఎడ్ల వెంకటస్వామి, బత్తిని అశోక్‌గౌడ్, తదితరులు పాల్గొన్నారు.

మొనగాడు కాదు.. మోసగాడు..

రుణమాఫీ చేస్తానని దేవుళ్లపై ఒట్లేసి మాట తప్పాడు
సీఎం రేవంత్‌పై మాజీమంత్రులు హరీశ్‌రావు, ఎర్రబెల్లి, సత్యవతిరాథోడ్ ఫైర్
తొర్రూరులో బీఆర్ఎస్ ఆధ్వర్యంలో రైతు ధర్నా




తొర్రూరు సభా వేదికలో ప్రసంగిస్తున్న మాజీ మంత్రి దయాకర్ రావు

తొర్రూరు, అక్టోబరు 4 : సీఎం రేవంత్‌రెడ్డి మొనగాడు కాదు.. మోసగాడని, అధికారంలోకి రాగానే పూర్తిస్థాయి రుణమాఫీ చేస్తానంటూ తొలి సంతకం చేసి రైతులను మోసగించాడని బీఆర్ఎస్ సీనియర్ నేతలు, మాజీ మంత్రులు తన్నీరు హరీశ్‌రావు, ఎర్రబెల్లి దయాకర్ రావు, సత్యవతిరాథోడ్ మండిపడ్డారు. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేయాలని డిమాండ్ చేస్తూ బీఆర్ఎస్ ఆధ్వర్యంలో శుక్రవారం మహబూబాబాద్ జిల్లా తొర్రూరులో రైతు ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా మాజీమంత్రులు, నేతలు ఎడ్లబండిపై నిరసన ర్యాలీ నిర్వహించి.. అనంతరం విశ్రాంతి భవనం వద్ద జరిగిన సమావేశంలో మాట్లాడారు. తొలుత హరీశ్‌రావు మాట్లాడారు. అన్నదాతలకు కల్లబొల్లి మాటలు చెప్పి వారిని మోసం చేశారని, రుణమాఫీ చేసేవరకు కాంగ్రెస్ సర్కారును వదిలిపెట్టే ప్రసక్తేలేదని హెచ్చరించారు. పాలకుర్తి నియోజకవర్గంలో 30 శాతం కూడా పూర్తిస్థాయిలో రుణమాఫీ కాలేదని, రైతులు రుణమాఫీ కోసం ఎదురు చూస్తున్నారని, మరికొందరు ఆత్మహత్యలు చేసుకుంటున్నారన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావస్తున్నా.. ప్రజలకు ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయకపోవడం సిగ్గుచేటని విమర్శించారు. పార్లమెంట్ ఎన్నికల ముందు రాహుల్‌గాంధీ వరంగల్‌లో ఇచ్చిన డిక్లరేషన్ మేరకు రుణమాఫీ, రైతు భరో సా, రైతుబంధు, పంటలకు బోనస్, అర్హులైన మహిళలకు రూ.2500 భృతి, పెన్షన్‌లు పెంపు లాంటి హామీలను అమలుపర్చకుండా మోసం చేస్తున్నారని, ప్రజలు బుద్ధి చెపుతారన్నారు. ఆగ స్టు 15 వరకు రైతులందరికీ రూ.2 లక్షల రుణమాఫీ చేస్తామని హామీ ఇచ్చి మొదట రూ.49 వేల కోట్లు, ఆ తర్వాత రూ.31 వేల కోట్లు చివరకు మాఫీ చేసింది రూ.17వేల కోట్లు మాత్రమే అన్నారు. తొర్రూరు మండలంలో 11 వేల మంది రైతులు రుణాలు తీసుకుంటే 5 వేల మందికి మాఫీ అయిందని, మిగతా రైతులకు వెంటనే రుణమాఫీ చేయాలని డిమాండ్ చేశారు.

మాజీ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు మాట్లాడుతూ.. రైతులకు పూర్తిస్థాయిలో రూ.2లక్షల రుణమాఫీ చేస్తానని యాదాద్రి, భద్రాద్రి, కొమురెల్లి, సమ్మక్క-సారలమ్మలపై సీఎం రేవంత్‌రెడ్డి ఒట్టు వేసి, మాఫీ చేస్తానని మోసం చేశాడని అన్నారు. రేవంత్‌రెడ్డి తన శిష్యుడే కానీ, బ్రోకర్ మాటలు చెపుతూ ప్రజలను మోసం చేస్తున్నాడని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక ఏ ఒక్క పథకాన్ని కూడా పూర్తిస్థాయిలో అమలు చేయలేదని విమర్శించారు. బీఆర్ఎస్ పార్టీ రైతులకు అండగా ఉంటుందని, ఎలాంటి షరతులు లేకుండా రుణమాఫీ చేయాలన్నారు. ఖబడ్దార్ రేవంత్‌రెడ్డి రైతులను మోసగిస్తున్న ఏ ప్రభుత్వం అధికారంలో కొనసాగలేదని, రాబోయే రోజుల్లో కాంగ్రెస్ ప్రభుత్వం కూలిపోవడం ఖాయమన్నారు. సీఎం రేవంత్ రెడ్డికి కూల్చుడు తప్ప కట్టుడు తెలువదన్నారు. హైడ్రా పేరుతో హైదరాబాద్‌లో కష్టపడి సంపాదించుకున్న ఇండ్లను కూలగొడుతున్నారని, మూసీ శుద్ధిపేరుతో మరో కుంభకోణానికి తెర లేపారన్నారు. పాలకుర్తి నియోజకవర్గంలో రైతులందరికీ రుణమాఫీ చేయాలని, ఇచ్చిన హామీలు అమలు చేయాలన్నారు.

గోడు వెళ్లబోసుకున్న రైతులు

తొర్రూరులో నిర్వహించిన బీఆర్ఎస్ పార్టీ రైతు ధర్నాకు రైతులు అధిక సంఖ్యలో హాజరయ్యారు. మాజీ మంత్రుల ఎదుట తమ గోడు వెల్లబోసుకున్నారు. వారిని మాజీమంత్రి సత్యవతి రాథోడ్ రుణం ఎంత ఉంది. భూమి ఎన్నిఎకరాలు ఉంది రుణమాఫీ కాకపోవడానికి అధికారులు ఏం చెపుతున్నారు లాంటి విషయాలు అడిగి తెలుసుకున్నారు. రుణమాఫీ కాకుండా రైతులు ఇబ్బందులు పడుతుంటే సీఎం రేవంత్ రెడ్డి ఢిల్లీ పెద్దల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నాడని, రైతుల గోడు పట్టించుకోవాలన్నారు. దసరా వరకు రుణమాఫీ చేయకపోతే రైతులతో కలిసి సచివాలయం ఎదుట ధర్నా చేస్తామని హెచ్చరించారు. పంట కోతకు వచ్చిందని, రైతుబంధు, రైతు భరోసా పడలేదని కేసీఆర్ ఉన్నపుడు రైతుబంధు వచ్చేదని రైతులు తమ గోడును వారికి వెల్లగక్కారు. ఏది ఏమైనా ప్రజలకు ఇచ్చిన ఆరు గ్యారెంటీలు అమలు చేస్తూ ఎలాంటి షరతులు లేకుండా రూ.2 లక్షల రుణమాఫీ చేపట్టాలని, అప్పటి వరకు సీఎం రేవంత్ రెడ్డిని, కాంగ్రెస్ ప్రభుత్వాన్ని వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో మాజీ ఎంపీ మాలోత్ కవిత, మాజీ మంత్రి సత్యవతిరాథోడ్, మాజీ స్పీకర్ మధుసూదనాచారి, ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు తాటికొండ రాజయ్య, పెద్ది సుదర్శన్ రెడ్డి, ఉమ్మడి వరంగల్ జిల్లా బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఏనుగు రాకేష్ రెడ్డి, రావుల శ్రీధర్ రెడ్డి, పాలకుర్తి నియోజకవర్గంలోని బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు, ప్రజా ప్రతినిధులు, రైతులు తదితరులు పాల్గొన్నారు.



నిరసనకు హాజరైన రైతులు, కార్యకర్తలు

చోరీ కేసులో ఇద్దరు నిందితుల అరెస్టు



నిందితుల ఇద్దరి అరెస్ట్, చోరీ సొత్తు వివరాలు చెబుతున్న రైల్వే సీఐలు

గిర్మాజీపేట, అక్టోబరు 4: సింహపురి ఎక్స్ ప్రెస్‌లో చోరీకి పాల్పడిన గొడుగు నవీన్ (21), గుగులోతు నరేష్(25)లను శుక్రవారం వరంగల్ రైల్వేస్టేషన్‌లో అరెస్ట్‌చేసి వారి నుంచి రూ.3.50 లక్షల విలువైన బంగారు ఆభరణాలను స్వాధీ నం చేసుకున్నట్లు వరంగల్ జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ తెలిపారు. వరంగల్ జీఆర్‌పీలో ఏర్పాటుచేసిన విలేఖరుల సమావేశంలో జీఆర్‌పీ సీఐ పి.సురేందర్ మాట్లాడారు. గతనెల 13న గూడూరు నుంచి సికింద్రాబాద్ వెళ్తున్న సింహపురి ఎక్స్‌ప్రెస్ రిజర్వేషన్ కోచ్‌లో ప్రయాణిస్తున్న మహిళా ప్రయాణికురాలు నిద్రలో ఉండగా బంగారు ఆభరణాలు చోరీకి గురయ్యాయని బాధితురాలు సికింద్రాబాద్ జీఆర్‌పీలో ఫిర్యాదు చేసింది. దీంతో గత నెల 26న వరంగల్ జీఆర్‌పీ బదిలీ అయిందన్నారు. ఇదిలా ఉండగా విధి నిర్వహణలో భాగంగా జీఆర్‌పీ సిబ్బంది శుక్రవా రం వరంగల్ రైల్వేస్టేషన్‌లో ప్లాట్‌ఫారాలు, ప్రయాణికుల తనిఖీ చేపట్టామన్నారు. ప్లాట్‌ఫాం2, ప్లాట్‌ఫాం3 ఫుట్‌ఓవర్ బ్రిడ్జి వద్ద అనుమానాస్పదంగా కనిపించిన ఇద్దరు వ్యక్తులను తనిఖీచేయగా వారి వద్ద బంగారు ఆభరణాలు లభించాయి. దీంతో గొడుగు నవీన్ (గార్ల- మహబూబాబాద్ జిల్లా), గుగులోతు నరేష్ (రాజుల పాలెం -ఖమ్మం జిల్లా) నెల 13న సికింద్రాబాద్ వెళ్తున్న సింహపురిలో ప్రయాణికురాలికి చెందిన బంగారు ఆభరణాలు దొంగిలించినట్లు వారు అంగీకరించారని సీఐ తెలిపారు. ఈ మేరకు నిందితుల నుంచి రూ.3.50లక్షల విలువైన బంగారు నెక్లెస్, రెండు బంగారు గాజులు, ఒక వెండి గ్లాస్, రెండు వెండి కుంకుమ భరిణెలు స్వాధీనం చేసుకుని కాజీపేట రైల్వేకోర్టు ద్వారా రిమాండ్ చేసినట్లు సీఐ తెలి పారు. సమావేశంలో ఆర్‌పీఎఫ్ సీఐ టి.ఎస్.ఆర్. కృష్ణ, జీఆర్‌పీ ఎస్సై మోహినుద్దీన్ పాల్గొన్నారు.

పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలి

- సీపీఎం జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి

తరిగొప్పుల, అక్టోబరు 4: కార్యకర్తలు గ్రామ స్థాయిలో సీపీఎం పార్టీ బలోపేతానికి అంకిత భావంతో పనిచేయాలని ఆ పార్టీ జనగామ జిల్లా కార్యదర్శి మోకు కనకరెడ్డి అన్నారు. సీనియర్ నాయకులు చింత బుచ్చయ్య అధ్యక్షతన శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన గ్రామ మహాసభల కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయి కార్యకర్తలను ఉద్దేశించి మాట్లాడారు. కార్మికులు, కర్షకలు, వ్యవసాయ కూలీల సమస్యలు పరిష్కారం జరగాలంటే దేశంలో కమ్యూనిస్టు పార్టీ బలోపేతం కావాలని ఆశాభావం వ్యక్తం చేశారు. దేశాన్ని పాలిస్తున్న బీజేపీ దేశంలో మతోన్మాదాన్ని పెంపొందిస్తూ లౌకిత స్ఫూర్తిని దెబ్బతీస్తుందన్నారు. ప్రధాని నరేంద్రమోడి అవలంభిస్తున్న ఆర్థిక విదానాలతో దేశంలో నిత్యావసరాల ధరలకు రెక్కలు వచ్చాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో మండల ఇన్‌చార్జి చందునాయక్, మండల కార్యదర్శి పాండ్యాల అంజయ్య, ఏదునూరి నర్సయ్య, మమిడాల రమేష్, ఆసరి గట్టయ్య, మర్రి రవి, రాజు పాల్గొన్నారు.

కొనసాగుతున్న దేవి నవరాత్రి ఉత్సవాలు

నర్మెట, అక్టోబరు 4 : నర్మెట మండలకేంద్రంతో పాటు వెల్దండ, మచ్చుపహాడ్ గ్రామాలలో ప్రతిష్ఠించిన దుర్గామాత అమ్మవారి విగ్రహం వద్ద రెండో రోజు శుక్రవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. రెండో రోజు అమ్మవారు గాయత్రి అమ్మవారు రూపంలో దర్శనమిచ్చింది. మండల కేంద్రంలో మసీదు గడ్డ యూత్ ఆధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. గ్రామాలప్రజలు పాల్గొన్నారు.

● పాలకుర్తి : శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో శ్రీ దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ఆలయ పూజారులు, పండితుల మంత్రో చ్చరణల నడుమ శుక్రవారం రెండో రోజున గాయత్రీ దేవి అలంకరణలో చండీకా పార్వతీ అమ్మవారు భక్తులకు దర్శనం ఇచ్చారు. ఆలయ ఈవో మోహన్‌బాబు, ఆలయ సూపరిండెంట్ వెంకటయ్య, అర్చకులు డీ.వీ.ఆర్ శర్మ అనిల్‌శర్మ ఉన్నారు.

● రఘునాథపల్లి : విజయ దశమిని పురస్కరించుకుని నిర్వహించే దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం రెండో రోజుకు చేరుకన్నాయి. మండల కేంద్రంలోని ఆర్య క్షత్రియ భవనం ముందు ఏర్పాటు చేసిన దుర్గామాత విగ్రహనికి భక్తులు భక్తిశ్రద్ధలతో ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో పూజారి పిండిప్రోలు శ్రీనివాస శర్మ, మండల కాంగ్రెస్ అధ్యక్షుడు కోళ్ల రవి, చీమలపాటి శ్రీనివాస్, బుస్సారి భానుజీ, రవీందర్, రఘు తదితరులు పాల్గొన్నారు.

● స్టేషన్‌ఘన్‌పూర్ టౌన్ : డివిజన్ కేంద్రం స్టేషన్ ఘన్‌పూర్, శివునిపల్లి పట్టణాల్లో బతుకమ్మ, విజయ దశమి పర్వదినోత్సవాలను పురస్కరించుకుని దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు శుక్రవారం రెండవ రోజు ఘనంగా నిర్వహించారు. స్థానిక ఎల్లమ్మ దేవాలయంలో, హనుమాన్ జ్యోతి షాలయం, శివునిపల్లి గాంధీ విగ్రహం, లలితాంబికా దేవాలయంలో ఉత్సవ కమిటీల ఆధ్వర్యంలో అమ్మవారిని గాయత్రీ దేవి కవచ రూపంలో అలంకరించారు. పెద్ద ఎత్తున హాజరైన భక్తులు ప్రత్యేక పూజలు చేపట్టారు. వేద పండితుల నేతృత్వంలో హోమాలు, అర్చనలు, సహస్ర నామార్చనలు నిర్వహించారు. కార్యక్రమాల్లో నిర్వాహకులు గన్ను శ్రీనివాస్, సునీత, గడ్డం కృష్ణమూర్తి, గన్ను కార్తీక్, విష్ణు శంకర్, సరాబు శశిక్, ఉమా శంకర్, బంగ్లా శ్రీను, వి.సురేందర్, పి.రంజిత్, వినయ్, వనం దిలీప్, మాజీ ఎంపీటీసీ నర్సింహులు, ఎం.విజయ్‌కుమార్, ఎం.విజయ్, వంశీ, తరుణ్, ఏ.సతీష్, మెతుకు శ్రీరాములు తదితరులు పాల్గొన్నారు.



నర్మెటలో దుర్గామాతకు పూజలు చేస్తున్న యూత్ సభ్యులు

ప్రభుత్వ భూమిని కాపాడాలి

బచ్చన్నపేట, అక్టోబరు 4: మండలంలోని సాల్వాపూర్ గ్రామంలో అన్యాక్రాంతమవుతున్న ప్రభుత్వ భూమిని కాపాడాలని కోరుతూ గ్రామానికి చెందిన పలువురు శుక్రవారం తహసీల్దార్ మహిపాల్‌రెడ్డికి వినతిపత్రం అందించారు. గ్రామంలోని 147/1 సర్వే నంబర్‌లోని 29 ఎకరాల 25 గుంటల భూమిని కబ్జా చేశారని, భూమికి హద్దురాళ్ల నిర్ణయించి, బోర్డులు ఏర్పాటు చేయాలని కోరారు. ఆలస్యం చేస్తే భూమి పూర్తిగా కబ్జా కావడం ఖాయమన్నారు. వినతిపత్రం అందించిన వారిలో శ్రీధర్‌గౌడ్, వెంకట్, ఐలయ్య, సురేష్ తదితరులున్నారు.

గాయత్రి జూనియర్ కళాశాలను సందర్శించిన డీఐఈవో

జనగామ కల్చరల్, అక్టోబరు 4: విద్యార్థినిలు అస్వస్థతకు గురైన నేపథ్యంలో జిల్లా కేంద్రంలోని గాయత్రి జూనియర్ కళాశాలను డీఐఈవో కల్లూరి జితేందర్‌రెడ్డి సందర్శించారు. శుక్రవారం కళాశాలను సందర్శించిన డీఐఈవో కళాశాలలో డైనింగ్ రూంను, విద్యార్థినిల డార్మెట్రీని పరిశీలించారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బందికి తగు సూచనలు చేశారు. వర్షాకాలం సీజన్ వ్యాధుల కాలం అయినందున విద్యార్థినిల భోజనం, వసతి, సంరక్షణపై అప్రమత్తంగా ఉండా లన్నారు. అనంతరం విలేఖరులతో మాట్లాడుతూ కళాశాల విద్యార్థినిలకు భోజనం బయట నుంచి వస్తుందని, కొంత మంది పిల్లలు సిక్ రూంలో చికిత్స పొందు తుండగా మరికొందరిని మెరుగైన వైద్యం కోసం ప్రైవేటు ఆసుపత్రికి తరలించారన్నారు. అప్రమత్తంగా ఉండాలని కళాశాల సిబ్బందిని ఆదేశించారు.

బిడ్డకు తల్లిపాలే శ్రేష్ఠం

జఫర్‌గడ్, అక్టోబరు 4 : బిడ్డకు తల్లిపాలు ఎంతో శ్రేష్ఠకరమైనవని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ టి.అనిత అన్నారు. మండలంలోని హిమ్మత్‌నగర్‌లోని అంగన్‌వాడీ కేంద్రంలో శుక్రవారం పిల్లలకు అన్న ప్రాసన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా హాజరైన సూపర్‌వైజర్ అనిత మాట్లాడారు. అంగన్‌వాడీ టీచర్లు సిహెచ్.విజయలక్ష్మీ, రాజమణి, గర్భిణులు, బాలింతలు, ఆయాలు పాల్గొన్నారు.

కొనసాగిన డిజిటల్ కార్డుల జారీ సర్వే

రఘునాథపల్లి, అక్టోబరు 4: ప్రభుత్వ సంక్షేమ పథకాలకు అర్హులైన ప్రతీ కుటుంబానికి బహుళ ప్రయోజనాలు చేకూర్చే లక్ష్యంతో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఫ్యామిలీ డిజిటల్ కార్డుల జారీ కోసం ఆయా కుటుంబాలకు సంబంధించిన పక్కా వివరాలు నమోదు చేసేందుకు గాను నిర్వహించే సర్వే కార్యక్రమం మండలంలోని కన్నాయిపల్లి, మాదారం గ్రామాలలో శుక్రవారం రెండో రోజు కొనసాగింది. ఒక్కొక్క గ్రామంలో అధికారులు రెండు బృందాలుగా ఏర్పడి ప్రతీ ఇంటికి వెళ్లి కుటుంబసభ్యులకు సంబంధించిన ఆధార్ కార్డులు, పుట్టిన తేది, తదితర వివరాలను నమోదు చేసుకొని, కుటుంబ సభ్యులందరిని ఒకే చోట నిలబెట్టి ఫోటో తీసుకుంటున్నారు. సర్వే కార్యక్రమంలో తహసీల్దార్ మోహిన్ ముజ్జబ, ఎంపీడీవో శ్రీనివాసులు, ఎంపీవో వెంకటేశ్వర్లు, డిఎల్‌పీవో వెంకట రెడ్డి, ఆర్ఐలు సాయిబాబా, కిషోర్, ఎంఆర్ఐ శరత్, పంచాయతీ కార్యదర్శులు అంతగల్ల కుమార్, భాస్కర్, ఫీల్డ్ అసిస్టెంట్ ఉమ్మగోని సరిత, యాట మంగమ్మ, నిర్మల పాల్గొన్నారు.



డిజిటల్ కార్డుల సర్వే చేస్తున్న అధికారులు

● పాలకుర్తి : పాలకుర్తి మండలంలోని రాఘవాపురం, చీమలబాయి తండా గ్రామాల్లో చేపట్టిన డీజిటల్ సర్వే పూర్తి అయిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఆర్డీవో డీఎస్ వెంకన్న అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రాఘవాపురం, చీమలబాయి తండా గ్రామాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాఘవాపురం గ్రామంలో మొత్తం 182 కుటుంబాలు సర్వే చేసినట్లు తెలిపారు. చీమలబాయి తండాలో 275 కుటుంబాలను సర్వే చేసినట్లు తెలిపారు. బహుళ ప్రయోజనాలకు ఉపయోగపడే విధంగా ప్రభుత్వం కార్డును జారీ చేస్తుందన్నారు. సర్వేలో తహసీల్దార్ శ్రీనివాస్, ఎంపీడీవో రాములు, ఆర్ఐ రాకేష్, పంచాయతీ కార్యదర్శులు యుగేందర్, చంద్రశేఖర్, ప్రియాంక మహేందర్, మాధవ్ ఉన్నారు.

రాష్ట్ర స్థాయి క్రీడాకారులుగా ఎదగాలి



క్రీడలను ప్రారంభిస్తున్న సంపత్‌రెడ్డి కూతురు సంజనారెడ్డి

చిలుపూర్, అక్టోబరు 4 : రాష్ట్ర స్థాయి క్రికెట్ క్రీడాకారులుగా గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న యువకులు ఎదగాలని దివంగత జడ్పీ చైర్మన్ సంపత్‌రెడ్డి కుమార్తె పాగాల సంజనారెడ్డి పిలుపునిచ్చారు. శుక్రవారం మండలంలోని రాజవరంలో ఆమె తండ్రి సంపత్‌రెడ్డి స్మారకార్థం నిర్వహిస్తున్న రాజవరం ప్రీమియర్ లీగ్ (ఆర్‌పీఎల్) 11వ సీజన్ క్రికెట్ క్రీడా పోటీలను ఆమె ప్రారంభించారు. కార్యక్రమంలో పాగాల వెంకట్‌రెడ్డి, బత్తుల సూర్యనారాయణ, ఎడ్ల శ్రీనివాస్, జనగామ యాదగిరి, అంబేద్కర్ సంఘాల ఐక్యవేదిక రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఇల్లందుల సుదర్శన్, మోటం రాజు, రంగు రవి, పంతం రాజుగౌడ్, ఎడ్ల రాజేశ్, శంకర్, నిర్వాహకులు ఎమ్డీ అసదుద్దీన్, ఎడ్ల అబ్రహం, ఎడ్ల మహిపాల్, విష్ణు, అశోక్, ఎడ్ల రాహుల్ పాల్గొన్నారు.

విగ్రహ ఏర్పాటు కోసం స్థల పరిశీలన

- దివంగత జడ్పీ చైర్మన్ పాగాల సంపత్‌రెడ్డి కాంస్య విగ్రహాన్ని ఆయన స్వగ్రామం రాజవరంలో నెలకొల్పడం కోసం బీఆర్‌ఎస్ పార్టీ జిల్లా నాయకుడు జనగామ యాదగిరి నేతృత్వంలో వుక్రవారం స్థల పరిశీలన చేపట్టారు. శుక్రవారం వివిధ గ్రామాలకు చెందిన నాయకులతో కలిసి రాజవరంకు చేరుకున్న జనగామ యాదగిరి, విగ్రహ ఏర్పాటు కోసం స్థానిక ప్రాథమిక పాఠశాల ఎదుట, బస్టాండ్ చౌరస్తా వద్ద స్థలపరిశీలన చేపట్టారు. డిసెంబరు 4న జరిగే ప్రథమ వర్ధంతిలోగా విగ్రహావిష్కరణ చేపడతామని ఆయన పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఇల్లందుల సుదర్శన్, పాగాల వెంకట్‌రెడ్డి, రంగు రవి, భైరగోని ఎల్లయ్య పాల్గొన్నారు.

రెండోరోజూ కొనసాగిన హోమం

పాలకుర్తి, అక్టోబరు 4 : నియోజకవర్గ కేంద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో శుక్రవారం స్థానిక ఎమ్మెల్యే యశస్వినిరెడ్డి ఆదేశాలతో బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ ఆధ్వర్యంలో కాంగ్రెస్ నాయకులు వీరమనేని యా కాంతరావు, పోగు శ్రీనివాస్ దంపతులు చండీ హోమంలో పాల్గొని పూజలు చేశారు. ఈ సందర్భంగా సత్యనారాయణ మాట్లాడుతూ ప్రజలు సుభిక్షంగా ఉండాలని, లోక కళ్యాణం కోసం హోమం కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు తెలిపారు. ఆ పార్టీ మండల అధ్యక్షుడు గిరగాని కుమారస్వామి, మహేందర్‌రెడ్డి ఉన్నారు.



హోమంలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు

పారిశుధ్య కార్మికులకు దుస్తుల అందజేత

జఫర్‌గడ్, అక్టోబరు 4 : మండలంలోని తమ్మడపల్లి(జి) గ్రామ పంచాయతీ పారిశుధ్య సిబ్బందికి స్టేషన్‌ఘన్‌పూర్ మార్కెట్ కమిటి మాజీ చైర్మన్ అన్నం బ్రహ్మారెడ్డి నూతన దుస్తులను బహూకరించారు. శుక్రవారం గ్రామ ప్రతినిధుల సమక్షంలో పారిశుధ్య కార్మికులకు రూ.10 వేల విలువ గల దుస్తులను అందించారు. ఈ సందర్భంగా బ్రహ్మారెడ్డి మాట్లాడుతూ పరిశుభ్రత, పారిశుధ్య నిర్వహణలో జీపీ కార్మికుల సేవలు మరువలేనివని ప్రశంసించారు. పంచాయతీ కార్యదర్శి హరీష్, స్థానిక నాయకులు కసరబోయిన రాజు, పి.యాకయ్య, నక్క కొమురయ్య, రాజ్ యాదవ్ పాల్గొన్నారు.

లింగాలఘణపురం తహసీల్దార్‌గా రవీందర్

లింగాలఘణపురం, అక్టోబరు4: జనగామ జిల్లా కలెక్టరేట్‌లో అడ్మినిస్ట్రేషన్ ఆఫీసర్‌గా పనిచేస్తున్న పి రవీందర్ లింగాలఘణపురం తహసీల్దార్‌గా నియామకమయ్యారు. ఈ మేరకు శుక్రవారం జిల్లా కలెక్టర్ షేక్ రిజ్వాన్ బాషా ఉత్తర్వులను జారీ చేయగా వెంటనే బాధ్యతలను స్వీకరించారు. ఇక్కడ తహసీల్దార్‌గా పనిచేసిన వినయలత భూరికార్డుల కమీషనర్ కార్యాలయం హైదరాబాద్‌కు బదిలీపై వెళ్లారు. కాగా తహసిల్దార్‌గా బాధ్యతలను స్వీకరించిన రవీందర్‌ను కార్యాలయ సిబ్బంది ఘనంగా సన్మానించారు.



ఈనెల 9న మాదిగల నల్లజెండాల ప్రదర్శన

జనగామ రూరల్, అక్టోబరు 4: ఈనెల 9న జిల్లాలో మాదిగల నల్ల జెండాల ప్రదర్శనను విజయవంతం చేయాలని ఎంఎస్‌పీ రాష్ట్ర నాయకుడు కొయ్యాడ మల్లేశ్, ఎంఆర్‌పీఎస్ ప్రధాన కార్యదర్శి రాగల్ల ఉపేందర్ పిలుపునిచ్చారు. జిల్లా కేంద్రంలోని విజయ పంక్షన్ హాల్లో శుక్రవారం ఎంఆర్‌పీఎస్, ఎంఎస్‌పీ అనుబంధ సంఘాల జిల్లా స్థాయి సమావేశం నిర్వహించారు.ఈసందర్భంగా ఉపేందర్, మల్లేశ్, కిషోర్, పైసా రాజశేఖర్‌లు మాట్లాడారు. సీఎం మొండి వైఖరికి నిరసనగా ఈనెల 9న జిల్లా వ్యాప్తంగా మాదిగల నల్ల జెండాల ప్రదర్శన చేపట్టాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో సందేన రవీందర్, రాజు పాల్గొన్నారు.

నాలాలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలి

జనగామ రూరల్, అక్టోబరు 4: నాలాలపై అక్రమ నిర్మాణాలను తొలగించాలని సీపీఎం నాయకులు శుక్రవారం మున్సిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లుకు వినతిపత్రం అందజేశారు. ఈసందర్భంగా పట్టణ కార్యదర్శి జోగు ప్రకాశ్ మాట్లాడుతూ జనగామ పట్టణం నాలాలపై అక్రమంగా ఇండ్లు, వాణిజ్య వ్యాపారుల షాపులు నిర్మించడంతో కొద్దిపాటి వర్షానికి కూడా పట్టణం జలమయం అవుతుందన్నారు.ప్రభుత్వం వెంటనే స్పదించి నాలాలపై అక్రమంగా నిర్మించిన కట్టడాలను తొలగించాలని కోరారు. కార్యక్రమంలో బూడిద గోపి పాల్గొన్నారు.

ఘన్‌పూర్ వాసికి డాక్టరేట్



కనకయ్య

స్టేషన్‌ఘన్‌పూర్, అక్టోబరు 4: స్టేషన్‌ఘన్‌పూర్ డివిజన్ కేంద్రానికి చెందిన జీడి కనకయ్యకు ప్రభుత్వ పరిపాలన శాస్త్ర విభాగం (పబ్లిక్ అడ్మినిస్ట్రేషన్)లో కేయూ పరీక్షల నియంత్రణ అధికారి ప్రొఫెసర్ ఎస్. నర్సింహాచారి శుక్రవారం డాక్టరేట్‌ను ప్రకటించారు. ఈ సందర్భంగా కనకయ్య మాట్లాడుతూ ఉమెన్ పొలిటికల్ ఎగ్జిక్యూటీవ్ ఇన్ పంచాయతీరాజ్-పర్సెప్షన్ అండ్ పర్ఫామెన్స్ ఇన్ వరంగల్ డిస్ట్రిక్ట్ ఏస్టడి అనే పరిశోధన పైన డాక్టర్ టి.వి.సుజాతకుమారి గారి పర్యవేక్షణలో పరిశోధన చేసిన సిద్ధాంతం గ్రంథాన్ని సమర్పించినందుకు గాను కాకతీయ యూనివర్సిటీ డాక్టరేట్‌ను ప్రకటించిందన్నారు. తాను ఉద్యోగ రీత్యా గోదావరి ఖనిలోని ప్రభుత్వ బాలుర జూనియర్ కళాశాలలో సివిక్స్ అధ్యాపకుడిగా పనిచేస్తున్నానని తెలిపారు. కనకయ్యకు డాక్టరేట్ రావడంపై గ్రామస్తులు, కేయూ ప్రభుత్వ పరిపాలన అధ్యాపకులు, పరిశోధక విద్యార్థులు అభినందించినట్లు తెలిపారు.

చేనేత కార్మికులకు అండంగా ఉండాలి



శిక్షణ పొందిన మహిళలకు కిట్‌ను అందజేస్తున్న శ్రీరాం శ్రీనివాస్

జనగామ రూరల్, అక్టోబరు 4: ప్రభుత్వాలు చేనేత కార్మికులకు అండంగా ఉండాలని పద్మశాలి సంఘ నాయకుడు శ్రీరాం శ్రీనివాస్ అన్నారు. జిల్లా కేంద్రంలోని వీవర్స్ కాలనీలో శుక్రవారం చేనేత శిక్షణ కేంద్రాన్ని హైద్రాబాద్ లోని చేనేత సేవ కేంద్రం అధికారి డాక్టర్ అరుణ్ కుమార్ ప్రారభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చేనేత వస్త్రాల తయారికి సంబందించి 45 రోజుల పాటు శిక్షణ ఇచ్చి రోజుకు రూ. 300 భృతి ఇవ్వడం జరుగు తుందన్నారు. బిర్రు వెంకటేశ్వర్లు, బొంతపల్లి నాగరాజు, యుగేందర్ పాల్గొన్నారు.

గీత కార్మికులకు శిక్షణ శిబిరాలు



గీత కార్మికులకు శిక్షణ ఇస్తున్న దృశ్యం

జఫర్‌గడ్, అక్టోబరు 4 : గీత కార్మికుల భద్రత కోసం ప్రభుత్వం నిపుణులతో రూపొందించిన 'కాటమయ్య రక్షణ కవచం' పేరుతో వెనుకబడిన తరగతుల (బీసీ) కార్పోరేషన్ ద్వారా విడతల వారీగా సేఫ్టీ కిట్లను పంపిణీ చేసేందుకు సన్నాహాలు చేపట్టింది. ఈ నేపథ్యంలో సేఫ్టీ మోకులపై గీత కార్మికులకు అవగాహన కల్పించేందుకు గాను శిక్షణ శిబిరాలను నిర్వహి స్తున్నారు. ఇందులో భాగంగా మండలంలోని ఉప్పుగల్లు, తిమ్మంపేట, తిమ్మాపూర్, షాపల్లి, కూనూరు, ఓబులాపూర్, సూరారం, హిమ్మత్‌నగర్, రఘునాథ్‌పల్లి, తమ్మడపల్లి(ఐ), తమ్మడపల్లి(జి) గ్రామాలకు చెందిన 172 మంది గీత కార్మికులకు శుక్రవారం మండలంలోని తిమ్మంపేటలో శిక్షణ కార్యక్రమం నిర్వహించారు. . శిక్షణ అనంతరం గీత కార్మికులకు ప్రభుత్వం కిట్లను అందిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు గూడ రవిందర్, వడ్లకొండ వెంకటేశ్, మొలుగూరి సంతోష్, పోతుల అంజయ్య, బాల్నె కార్తిక్‌తో పాటు గీత కార్మికుల సంఘం మండల అధ్యక్షుడు గడ్డం రాజు, తిమ్మంపేట అధ్యక్షుడు మల్లం రాజమౌళి, జిల్లా ప్రతినిధులు యాదగిరి, మూల యాకయ్య, సతీష్, దర్గయ్య, మహేందర్, సుభాష్, సురేశ్, ప్రవీణ్, గీత కార్మికులు పాల్గొన్నారు.

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

కొడకండ్ల, అక్టోబరు 4 : సూర్యాపేట జిల్లా తిర్మలగిరి మండలం అనంతారం వాగు నుంచి అక్రమంగా మండలానికి తరలిస్తున్న బేతి రమేశ్‌కు చెందిన ఇసుక ట్రాక్టర్‌ను శుక్రవారం ఉదయం జప్తు చేసినట్లు ఎస్ఐ రాజు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు.

స్నేహితుడికి ఆర్థికసాయం


నర్మెట, అక్టోబరు 4 : జనగామ మండలం వెంకిర్యాల గ్రామానికి చెందిన రామగుండం సత్తయ్య నర్మెట మండలకేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పదవ తరగతి వరకు చదువుకున్నాడు. ఇటీవల రామగుండం సత్తయ్య భార్య ఉపేంద్ర(48) అనారోగ్యంతో మృతి చెందారు. విషయం తెలుసుకున్న 1985-86 పదవ తరగతి బ్యాచ్ స్నేహితులు ఆర్థిక ఇబ్బందుల్లో స్నేహితుడికి రూ. 70 వేలు ఆర్థిక సహాయం చేశారు. స్నేహితునికి కుటుబానికి అండగా ఉంటామని భరోసా ఇచ్చారు.కార్యక్రమంలో గోపగోని శోభన్‌బాబు, నీరటి సుధాకర్, నాగంపల్లి శ్రీనివాస్, మల్లాడి శ్రావణ్, గోపగోని యాదగిరి, ప్రభాకర్ పాల్గొన్నారు.

రిజర్వాయర్ నీటిలో కొట్టుకపోయి నాలుగు పాడి గేదెలు మృత్యువాత

రఘునాథపల్లి, అక్టోబరు 4: అశ్వరావుపల్లి రిజర్వాయర్ నుంచి యదాద్రి భువనగిరి జిల్లా ఆలేరుకు వెళ్లే కాలువలోకి సంబంధిత అధికారులు అకస్మాత్తుగా నీరు వదలడంతో నాలుగు గేదెలు కొట్టుకుపోయాయి. బాధితుడు తెలిపిన కథనం ప్రకారం.. మండలంలోని జాఫరగూడెం గ్రామానికి చెందిన కావటి మహేందర్‌కు చెందిన ఆరు పాడి గేదెలు కాల్వ ఒడ్డున మేస్తున్నాయి. అధికారులు నీటిని వదలడంతో నీటి ప్రవాహ వేగానికి తట్టుకోలేక కొట్టుకపోగా, అందులో నాలుగు పాడి గేదెలు మృతి చెందాయి. రెండు పాడి గేదెలు ప్రాణాపాయ స్థితిలో కొట్టుమిట్టాడుతున్నాయి. మృతి చెందిన నాలుగు పాడి గేదెల విలువ సుమారు రూ.3 లక్షలు ఉంటుందని బాధిత రైతు కావటి మహేందర్ రోదిస్తూ తెలిపాడు. రైతు కుటుంబాన్ని ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

ప్రజా సమస్యల పట్ల పోరాడే పార్టీ సీపీఎం

జనగామ రూరల్, అక్టోబరు 4: ప్రజా సమస్యలపై పోరాడే పార్టీ సీపీఎం పార్టీ అని సీపీఎం పట్టణ కార్యదర్శి జోగు ప్రకాష్ డిమాండ్ చేశారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలోని వీవర్స్‌కాలనీ 11, 12 వార్డులలో శాఖ మహాసభ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రకాష్ మాట్లాడుతూ ప్రజా సమస్యలు పరిష్కారం కావాలంటే కమ్యూనిస్టు పార్టీ బలోపేతం జరగాలని, అందుకోసం కార్యకర్తలు అంకితభావంతో పని చేయాలన్నారు. పట్టణంలో మురికి కాల్వలు శుభ్రం చేయకపోవడంతో స్థానికులు రోగాల బారిన పడుతున్నారన్నారు. వెంటనే మురికి కాలువలు శుభ్రం చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో రాపోలు రజిత, కళ్యాణం లింగం, వెంకటేష్, వరలక్ష్మి, పద్మ, లలిత పాల్గొన్నారు.



హద్దులు నిర్ణయించాకే ప్రహరీ నిర్మించాలి

చిలుపూర్, అక్టోబరు 4 : మండలంలోని ఆయా గ్రామాల్లో నెలకొన్న ప్రభుత్వ సహకార సొసైటీ స్థలాలకు జీపీ రికార్డుల ప్రకారం హద్దులు నిర్ణయించాకే, ప్రహరీగోడలు నిర్మించాలని స్టేషన్‌ఘన్‌పూర్ వ్యవసాయ మార్కెట్ మాజీ డైరెక్టర్, బీఆర్‌ఎస్ పార్టీ సోషల్ మీడియా నియోజకవర్గ కోఆర్డినేటర్ రంగు హరీష్ డిమాండ్ చేశారు. శుక్రవారం మండలంలోని శ్రీపతిపల్లిలో నెలకొన్న సహకార సొసైటీ భవనంతో పాటు, దానికి సంబంధించిన స్థలాన్ని ఆయన పరిశీలించారు. అధికారులు వెంటనే స్పందించి సొసైటీ స్థలాలను కాపాడేందుకు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకుడు పోలబోయిన జోగులు, ఎస్కే. యాకూబ్‌పాషా, బొల్లు భిక్షపతి, పిట్టల సురేశ్‌పాల్గొన్నారు.

ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని పూజలు

పాలకుర్తి, అక్టోబరు 4 : తొర్రూరులో స్టేజీ కూలి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతున్న పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని శుక్రవారం మండల కేంద్రంలోని శ్రీ సోమేశ్వరలక్ష్మీనర్సింహస్వామి ఆలయంలో కాంగ్రెస్ నాయకులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆ పార్టీ బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, మండల అధ్య క్షుడు గిరగాని కుమారస్వామి మాట్లాడారు. ఎర్రబెల్లి రాఘవ రావు, దొంతి విజేందర్‌రెడ్డి యాకాంతారావు, చిలువేరు కృష్ణమూర్తి, బిర్రు సోమేశ్వర్, పెనుగొండ రమేష్, ఐలేష్ యాదవ్, శ్రీనివాస్ ఉన్నారు.

● దేవరుప్పుల : పాలకుర్తి కాంగ్రెస్ పార్టీ ఇంచార్జీ హనుమాండ్ల ఝాన్సీరెడ్డి తొందరగా కోలుకోవాలని మండల కాంగ్రెస్ శ్రేణులు ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా శుక్రవారం కడవెండి శివారులోని శ్రీ వానకొండయ్య లక్ష్మీనరసింహాస్వామి ఆలయంలో ప్రత్యేకపూజులు నిర్వహించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు నల్ల శ్రీరామ్, నాయకులు రెడ్డి రాజుల యాకన్న, రెడ్డి రాజుల రమేష్, పులిగిళ్ల వెంకన్న, తీగల వెంకన్న, నర్సింహా తదితరులు పాల్గొన్నారు.

● కొడకండ్ల : ఇటీవల గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డిని మండల కాంగ్రెస్ నాయకులు శుక్రవారం పరామర్శించారు. ఈజీఎస్ డైరెక్టర్ అందె యాకయ్య, సురేష్ , రాజేష్ తదితరులు పాల్గొన్నారు. ఇటీవల గాయపడి హైదరాబాద్ ఆసుపత్రిలో చికిత్సపొందుతున్న పాలకుర్తి నియోజకవర్గ కాంగ్రెస్ ఇన్‌చార్జి ఝాన్సీరెడ్డి త్వరగా కోలుకోవాలని మండలకేంద్రంలోని రాజ రాజేశ్వరీ ఆలయంలో మండలపార్టీ అధ్యక్షుడు డి.సురేష్ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్యక్రమంలో సోమనర్సయ్య, రాజేష్, భిక్షపతి, రమేశ్, రాజు, రవీందర్, బత్తుల వెంకన్న పాల్గొన్నారు.





ఝాన్సీరెడ్డిని పరామర్శిస్తున్న నేతలు, లక్ష్మీనరసింహాస్వామి వద్ద నాయకుల పూజలు

తొర్రూరు రైతు ధర్నాకు తరలిన శ్రేణులు

దేవరుప్పుల, అక్టోబరు 4: రైతు రుణమాఫీ చేయటంలో రాష్ట్ర ప్రభుత్వం అవలంభిస్తున్న నిర్లక్ష్య వైఖరికి నిరసనగా పాలకుర్తి నియోజకవర్గం తొర్రూర్ రైతు ధర్నాకు దేవరుప్పుల మండలంలోని అన్ని గ్రామాలనుంచి శుక్రవారం రైతులు, బీఆర్‌ఎస్ శ్రేణులు భారీ సంఖ్యలో తరలి వెళ్లారు. రాష్ట్రమాజీ మంత్రులు హరీష్‌రావు, ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్‌లు హాజరు కానున్న నేపథ్యంలో అధిక సంఖ్యలో స్వచ్చందంగా వాహనాలలో తరలి వెళ్లారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ జిల్లా నాయకులు పల్లా సుందర్‌రామ్‌రెడ్డి, మండల బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షుడు తీగల దయాకర్, నాయకులు బస్వ మల్లేశం, చింత రవి, కొల్లూరు సోమయ్య, వంగ అర్జున్, భిక్షపతి, తిరుమలేష్, యాదగిరి, బిల్లా యాదవరెడ్డి, బస్వ వెంకన్న, పాము మోహన్, రామూర్తి పాల్గొన్నారు.

సీజేఐటీలో బతుకమ్మ సంబరాలు

జనగామ కల్చరల్, అక్టోబరు 4: జనగామ మండలం యశ్వంతాపురం క్రీస్తుజ్యోతి ఇంజనీరింగ్ కళాశాల (సీజేఐటీ)లో బతుకమ్మ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ మేరకు శుక్రవారం కళాశాలలో జరిగిన వేడుకలకు విద్యార్థులు సంప్రదాయ వస్త్రధారణతో హాజరై బతుకమ్మ పాటలతో, నృత్యాలతో అత్యంత కన్నుల పండువగా జరుపుకున్నారు. పలు రాష్ట్రాలకు చెందిన విద్యార్థులు వారి ప్రాంత వేషధారణలతో బతుకమ్మ వేడుకల్లో పాల్గొని ఆకట్టుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల డైరెక్టర్ డి.విజయపాల్‌రెడ్డి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ తమ కళాశాలలో వివిధ మతాల, ప్రాంతాల పిల్లలు చదువుతున్నారని తెలిపారు. విదేశీ మోజులో పడి యువత తమ ఆచారాలు పండుగలను మరచిపోతున్నారని తెలిపారు. అధ్యాపకులు సంతోష కుమారి, స్వర్ణ, సరిత, ఆమణి పాల్గొన్నారు.

ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు

ఎస్ఎఫ్ఐ జనగామ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. శుక్రవారం జనగామ జిల్లా కేంద్రంలో ఎస్ఎఫ్ఐ జిల్లా బాలికల కన్వీనర్ దాసగాని సుమ, జిల్లా కార్యదర్శి ధర్మబిక్షం సంబురాలను ప్రారంభించి మాట్లాడారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ నాయకులు లవకుమార్, రమేష్, ఆర్య, మురళి, మానస, ధన్వంతి, సురేఖ, కీర్తన తదితరులు పాల్గొన్నారు.



సీజేఐటీలో బతుకమ్మ సంబరాల్లో పాల్గొన్న విద్యార్థినిలు

●జఫర్‌గడ్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో శుక్రవారం బతుకమ్మ సంబరాలను నిర్వహించారు. విద్యార్థినులు, కళాశాల మహిళా అధ్యాపకులు కలిసి తంగేడు, గునుగు, చామంతి, బంతి, తీరొక్క పూలను సేకరించి అందంగా బతుకమ్మలను పేర్చారు. వాటిని కళాశాల ఆవరణలో ఉంచి చుట్టూ తిరుగుతూ బతుకమ్మ ఆట పాటలతో సందడి చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ ప్రమోద్‌కుమార్, విద్యార్థులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబానికి పరామర్శ

తరిగొప్పుల, అక్టోబరు 4: మండల కేంద్రానికి చెందిన బీఆర్‌ఎస్ సీనియర్ నాయకుడు కలకుంట్ల వెంకటయ్య(65) గత కొంత కాలంగా అనారోగ్యంతో బాధపడుతూ శుక్రవారం ఉదయం మృతి చెందారు. విషయం తెలిసిన జనగామ ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, తరిగొప్పుల మాజి ఎంపీటీసీ అర్జుల మధుసూధన్ రెడ్డి వెంకటయ్య పార్థివ దేహాన్ని సందర్శించి బాధిత కుటుంబాన్ని పరామర్శించారు. బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు పింగిళి జగన్‌మోహన్ రెడ్డి, నాయకులు చిలువేరు లింగం, జొన్నగోని సుదర్శన్ గౌడ్, ముద్దసాని వెంకట్‌రెడ్డి, మాజి సర్పంచ్ దామెర ప్రభుదాస్, ఎడెల్లి శ్రీనివాస్ రెడ్డి, జుంలాల్ నాయక్, తాళ్లపల్లి రాజేశ్వర్ గౌడ్, పోషయ్య గౌడ్, వంగ రామారావు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.



మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే పల్లా